క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు


ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీసాయిబాబా ఆలయ 26వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇందారుపు మధుకర్‌శర్మ, గట్టుసాయిశర్మ, విజయ్‌కుమార్‌శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయినాథుడికి గణపతి పూజ, అభిషేకం, పల్లకి సేవ, అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రెబ్బెన: మండల కేంద్రంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. సీతరామాంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. రెబ్బెన తహసీల్దార్ రామ్మోహన్‌రావు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు తిరుపతి, శ్రీనివాస్, దుర్గం రాజేశ్, మిట్ట దేవేందర్, చిరంజీవిగౌడ్ పాల్గొన్నారు.

నేడు అఖిలపక్షం సమావేశం

బెజ్జూర్: మండల కేంద్రంలోని అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు అఖిలపక్షం సమావేశం నిర్వహించనున్నట్లుగా ఎంపీడీవో గౌరీ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆదేశాల మేరకు సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కులగణన తదితర అంశాలపై రాజకీయ ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలు స్వీకరించడం జరుగుతుందన్నారు.

నిరుపయోగంగా శ్మశానవాటిక



లగ్గాం శ్మశాన వాటిక

దహెగాం: మండలంలోని చౌక, లగ్గాం గ్రామాల శ్మశాన వాటికలు నిరుపయోగంగా మారాయి. గత మూడు సంవత్సరాల క్రితం వచ్చిన భారీ వరదలకు పెద్దవాగు ఉప్పొంగడంతో శ్మశాన వాటికలు ధ్వంసమయ్యాయి. అప్పటి నుంచి అవి నిరుపయోగంగా మారాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వాంకిడి: మండలంలోని బంబార ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యల గురించి వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, దీని ద్వారా అంటు వ్యాధులు సోకకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్, వార్డెన్ రాంచందర్, ఏఎన్‌ఎం సునంద, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

కౌటాల: గ్రామీణ ప్రాంత యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని టీపీసీసీ సభ్యులు అర్షద్ హుస్సేన్ అన్నారు. సోమవారం మండలంలోని వీర్దండి గ్రామంలో కబడ్డీ పోటీలు ప్రారంభించారు. యువకులు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి సారించాలన్నారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం యువకులతో కలిసి కబడ్డీ ఆడారు. మొదటి బహుమతి రూ. 30 వేలు, ద్వితీయ బహుమతి రూ. 20 వేలు, మూడో బహుమతి రూ.5 వేలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నైతం సీతల్, బండు, ఖాసీం, రాంచందర్, ప్రేమ్‌సాగర్, నానాజీ, సుధాకర్, వినోద్, రూపేష్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మొరం దందా..!

- అనుమతులు లేకుండానే తవ్వకాలు
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



అక్రమ తవ్వకాలు జరుపుతున్న అక్రమార్కులు (ఫైల్)

బెజ్జూర్: మొరం అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది. కొందరు అధికారులు అక్రమార్కులకు వత్తాసు పలుకుతూ ధనార్జనే ధ్యేయంగా ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. దీంతో అక్రమ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా జోరుగా సాగుతోంది. వీరి అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వానికి కట్టాల్సిన రాయల్టీని ఎగ్గొడుతున్నారు. సంబంధిత శాఖల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మొరం తవ్వకాలు జరుపుతూ అందినకాడికి దండుకుంటున్నారు. బెజ్జూర్ మండలం లంబాడిగూడ, సలుగుపల్లి గ్రామాల మధ్యలో గల ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణం కోసం మొరాన్ని అక్రమంగా తవ్వుతున్నారు.

అనుమతులు లేకుండానే..

మొరం తవ్వకాల కోసం భూగర్భ గనుల శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. పర్యావణాన్ని దృష్టిలో ఉంచుకొని రెవెన్యూ, భూగర్భ జలాలు, నీటి పారుదల శాఖ, వ్యవసాయ, ఇతర శాఖల వారు తవ్వకాలకు అనుమతి ఇస్తారు. ఒక్కో క్యూబిక్ మీటర్ కోసం రూ.30 రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ట్రాక్టర్‌కు సుమారు రూ.200 వరకు ఉంటుంది. ప్రభుత్వ భూములైనా, పట్టా భూములైనా అనుమతులు తప్పనిసరి పొందాలి. ప్రస్తుతం బెజ్జూర్ మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నాయి.

అధికారుల దురుసు ప్రవర్తన..

మొరం తవ్వకాలపై అధికారులకు సమాచారం అందించినా.. అధికారులు మాత్రం స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచాల్సిన సంబంధిత అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి ఫలాన వ్యక్తులు సమాచారం ఇస్తున్నారని అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారు. ఇటీవల అధికారులు స్పందించకపోవడంతో సబ్ కలెక్టర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఆయన స్పందించి అక్కడికి వెళ్లాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అక్కడికి చేరుకున్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండానే వెనుదిరగడం గమనార్హం.

కొల్లగొడుతున్న ప్రకృతి సంపద..

పలు మండలాల్లో ప్రకృతి సంపదను అక్రమార్కులు అడ్డగోలుగా కొల్లగొడుతున్నారు. అడ్డుకోవాల్సిన సంబంధిత అధికారులు అక్రమార్కులకు అండగా నిలవడం గమనార్హం. ట్రాక్టర్ ట్రిప్పు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు విక్రయిస్తున్నా.. సంబంధిత శాఖ అధికారులు మాత్రం మాకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై ఫిర్యాదు చేసినా.. ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఎమ్మెల్సీ దండె విఠల్



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

పెంచికల్‌పేట్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం మాజీ జెడ్పీటీసీ సముద్రాల సరితరాజన్నల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆయన వెంట దహెగాం మాజీ జెడ్పీటీసీ రామారావు, రాచకొండ కృష్ణ, శంకర్‌గౌడ్, కొల్లి పాక శ్రీనివాస్, ఉస్మాన్, ఇలియాస్, నందు, అతహాబేగ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

మారుపేర్ల సమస్యకు పరిష్కారం చూపాలి



పోరుయాత్ర ప్రారంభిస్తున్న బాధితులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో ప్రధానంగా ఉన్న మారుపేర్ల సమస్యకు యాజమాన్యం పరిష్కారం చూపాలని సింగరేణి ఉద్యోగుల బాధిత డిపెండెంట్లు డిమాండ్ చేశారు. విజిలెన్స్ విచారణ పేరుతో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం నుంచి చలో కొత్తగూడెం పోరుయాత్రను ప్రారంభించారు. ముందుగా జీఎం కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణిలో మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని అనేక సార్లు ఎమ్మెల్యేలు, ఎంపీలకు మొరపెట్టుకుంటున్న పట్టించుకోలేదన్నారు. బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, రామగుండం, భూపాలపల్లి, మణుగూరు, సత్తుపల్లిల మీదుగా కొత్తగూడెం వరకు పోరుయాత్ర సాగుతుందన్నారు. కార్యక్రమాల్లో కారుణ్య నియామకాల డిపెండెంట్ బాధితులు తిరుమల శ్రీనివాస్, శ్రావణ్, సందీప్, ఓం ప్రకాష్, దుమ్మటి రాజు, జిల్లాల శ్రావణ్, ఈర్ల సతీష్, నవీన్‌కుమార్, సునీల్‌రెడ్డి, హరీశ్, వెంకటస్వామి, కుమార్‌యాదవ్, హిమబిందు, కాసు భీరయ్య పాల్గొన్నారు.

న్యాయం చేయండి సారు



మాట్లాడుతున్న పోషన్న

ఆసిఫాబాద్‌అర్బన్: తమ కుటుంబానికి న్యాయం చేయాలని దహెగాం మండలం ఇట్యాల గ్రామానికి చెందిన సందెల పోషన్న కోరాడు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వారసత్వంగా వచ్చిన ఇల్లును కాజేసేందుకు తన అన్న తమపై దౌర్జన్యం చేస్తున్నాడని, ఇదే విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆస్తిలో తనకు రావాల్సిన వాటాను అడిగితే బెదిరింపులకు గురి చేస్తున్నాడని వాపోయాడు. తన కుటుంబానికి ప్రాణహాని ఉందననారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరాడు. ఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశాడు.

కొనసాగుతున్న నవరాత్రులు




ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని భక్తుల కొంగు బంగారమైన శ్రీ బాలేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 16 వరకు నిర్వహించే బాలేశ్వరస్వామి నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఆలయంలో అర్చకులు శ్రీధర్, అజయ్, విజయ్‌కుమార్ శర్మల ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, కుంకుమార్చన, రుద్రహోమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

నేడు రథోత్సవం

నవరోత్సవాల్లో భాగంగా మంగళవారం ముగింపు కార్యక్రమం సందర్భంగా ఆలయంలో రతోత్సవ నిర్వహించేందుకు ఆలయ కమిటీ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు పూర్తి చేశారు. రథ సప్తమిని పురస్కరించుకొని నేడు ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి నిత్య పూజా విధుల అనంతరం భక్తులకు శ్రీపార్వతీ సమేత బాలేశ్వర స్వామి దివ్య దర్శనానికి అనుమతి ఇవ్వనున్నారు. ఉదయం 11 గంటల నుండి మహా అన్నప్రసాద వితరణ చేయనున్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



కమలను సన్మానిస్తున్న నాయకులు

కౌటాల: బీఆర్‌ఎస్‌తోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని సిర్పూర్ నియోజకవర్గ మహిళా కోకన్వీనర్ కమల అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆరె సంక్షేమ సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. పార్టీని బలోపేతం కృషి చేసిన కార్యకర్తలను పార్టీ గుర్తింపునిస్తుందన్నారు. ఇటీవల సిర్పూర్ నియోజకవర్గ మహిళ కో కన్వీనర్ కమలను మండల నాయకులు సన్మానించారు. సమావేశంలో నాయకులు నాగపురి బండు, ఆదే నాందేవ్, రాజు, నవీన్, ఆనంద్, లక్ష్మణ్, దీలిప్, వరలక్ష్మి, లావణ్య పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రెబ్బెన: మండలంలోని నంబాలలో ప్రసన్న పరమేశ్వర ఆలయంలో నూతన రథోత్సవ షెడ్డు నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. గ్రామానికి చెందిన సింగరేణి ఉద్యోగులు స్వామి వారి రథోత్సవానికి వినియోగించే రథాన్ని భద్రపర్చేందుకు అవసరమైన షెడ్డు నిర్మాణం కోసం ముందుకు వచ్చి రూ. 1,11,000 విరాళంగా అందచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెన్న సోమశేఖర్, ఆలయ కమిటీ చైర్మన్ ఆడే వేణు, మాసాడి జగన్, తిరుపతి, సత్యనారాయణ, శివాజీ, మల్లేష్, ఆనంద్‌రావు, శంకర్ పాల్గొన్నారు.

'సోనియాగాంధీ క్షమాపణ చెప్పాలి'



మాట్లాడుతున్న రాథోడ్ రితేశ్

ఉట్నూర్‌రూరల్: రాష్ట్రపతి ముర్ము ప్రసంగాన్ని కించపరిచే విధంగా మాట్లాడిన సోనియా గాంధీ వెంటనే భారత రాష్ట్రపతికి, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేశ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగిస్తుండగా పూర్‌లేడి, పూర్ స్పీచ్ అంటూ సోనియా గాంధీ మాట్లాడడం సరికాదన్నారు. క్షమాపణలు చెప్పకపోతే కాంగ్రెస్ కార్యాలయాన్ని బీజేపీ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయన వెంట బానోత్ జగన్, ఆడే ధన్‌లాల్, కొండేరి రమేశ్, వెంకటేశ్ మరికంటి నారాయణ, సతీశ్, బానోత్ ఉపేందర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి



చింతలమానెపల్లి: పాల్గొన్న భక్తులు

చింతలమానెపల్లి: మండలంలో వసంత పంచమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలు, రవీంద్రనగర్‌లో భక్తులు భారీ సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. రవీంద్రనగర్‌లో సరస్వతి మాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు.

కౌటాల: కౌటాల మండలంలోని భక్తులు సోమవారం భక్తిశ్రద్ధలతో వసంత పంచమి వేడుకలను నిర్వహించారు. సదాశివపేట శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. అలాగే వాహిని, శ్యాం మోడల్ పాఠశాలల్లో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అంబెద శంకరయ్య, సంతోష్, పాఠశాల హెచ్‌ఎంలు మారుతి, తిరుపతి పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని శ్రీబాలాజీ ఆలయం, రాచర్ల హనుమాన్ ఆలయం, రైల్వేకాలనీలోని రామాలయం, శివాలయం, మండలంలోని శ్రీ సిద్ధి టోంకిని హనుమాన్ ఆలయం, లోనవెల్లిలోని రామాలయాల్లో భక్తులు పూజలు చేషశారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. స్థానిక సరస్వతి విద్యాపీఠ ఆవరణలో నిర్వాహకులు అర్చకుల సమక్షంలో సరస్వతి విగ్రహ వద్ద పూజలు చేశారు. ఆనంతరం వాసవి క్లబ్ అధ్వర్యంలో చిన్నారులకు పలకలు, బలపాలు పంపిణీ చేశారు.

కాగజ్‌నగర్ రూరల్: వసంత పంచమి వేడుకలను సోమవారం పట్టణం, మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని శ్రీ శివమల్లన్న దేవాలయంతో పాటు పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాల, ఎంఎస్‌ఆర్ పాఠశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసం చేయించారు.




సిర్పూర్(టి): శ్రీ బాలాజీ ఆలయంలో..



కౌటాల: శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

నేరడిగొండ: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు జక్కుల నారాయణ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎంపీ కలీమ్‌కు, పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సై రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, ఇళ్లు, రుణాలు, పరికరాలు, బ్యాక్‌లాక్ పోస్టులు అందడం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు పోశెట్టి, రాథోడ్ గణేష్, కత్తుల పురం నారాయణ పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో రాష్ట్రానికి ఇచ్చిందేమీ లేదు'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధుల కేటాయింపులో ఇచ్చిందేమీ లేదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో టీపీసీసీ చీఫ్ పిలుపు మేరకు నిరసన చేపట్టి, ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్రం ప్రకటించిన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి తీరని నష్టం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఖయ్యూం, ఎక్బాల్, చంద్రయ్య, కలీం, మహేందర్, నర్సయ్య, లాజర్, రాహుల్, రాధాబాయి కలీంపాషా, నాయకులు, కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు ప్రారంభం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని వంజీరి గ్రామ పంచాయతీలో గల నందిగూడ గ్రామంలో ఉపాధిహామీ పనులు సోమవారం ప్రారంభించారు. కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని ఏపీవో బుచ్చన్న సూచించారు. కార్యక్రమంలో సాంకేతిక నిపుణులు సయ్యద్ సోయబ్, క్షేత్ర సహాయకుడు గులాబ్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానం



ఆహ్వానం అందజేస్తున్న యూత్ సభ్యులు

బెజ్జూర్: క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని బెజ్జూర్ యూత్ సభ్యులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్‌ను ఆహ్వానించారు. టీపీసీసీ మెంబర్ అర్షద్ హుస్సేన్‌తో కలిసి సోమవారం ఆహ్వాన పత్రం అందజేశారు. చిన్న సిద్దాపూర్ గ్రామ సమీపంలో బెజ్జూర్ యూత్ ఆధ్వర్యంలో ఈనెల 5న నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి రావాలని కోరారు. కార్యక్రమంలో రంగు సురేశ్‌గౌడ్, రాచకొండ ఆదర్శ్, కంబాల, షకీల్, మేకల కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.